
20-6-84

# శ్యమంతక రేఖ

చిట్టా దామోదర శాస్త్రి



“ఫాతిమా! నీ వీ సాయం చేసి పెట్టాలి. ఇప్పుడు నీ కిచ్చిన దానికి రెట్టింపు ముట్టచెప్తా!” అర్థించాడు వీరేశలింగం.

వీరేశలింగం సంస్కృతం క్షుణ్ణంగా చదువుకొన్నాడు. సరదాకు హస్త సాముద్రికం నేర్చుకొన్నాడు. కొన్ని వేల చేతులు చూశాడు. దాని నొక పరిశోధనగా సాగించాడు. మొదట్లో చేతులు చూసి వదిలేసేవాడు. పరిశోధనలో పడిన దగ్గరనుంచి హస్తముద్రలను సేకరించి, వర్గీకరించి తాను చేసే ఈ పరిశోధన తరువాతి తరాలకు ఉపయోగపడాలని తహతహ లాడుతున్నాడు.

“సాములూ! మీరు ఆ చేతిముద్రలు సాధించలేరు. మా షా బేగం ఓ బంగారు పంజరంలో ఉంది” అన్నది ఫాతిమా. మొదట్లో ఎన్నో అడ్డంకులు చెప్పింది. తన అమీరు ముదునలి అన్నది. మీరు చెప్పిన అపురూప సౌందర్యవతి కొత్తగా రాలేదన్నది. కాని, నజరానాలు చూసి మెత్తబడింది. తాను షా బేగానికి ప్రధాన సేవకురాల్నని ఒప్పుకొన్నది. వారానికో, పక్షానికో తన కన్నవారింటికి వచ్చి చూసి వెడుతుందట. వీరేశలింగం ఫాతిమాను అక్కడ పట్టుకొన్నాడు.

“ఇది నీవల్లే కావాలి. నీవు చెప్పినట్లు దీన్ని బ్రహ్మారుద్రులు సాధించలేరు. మా పురాణాలలో శక్తి అని ఉన్నది. ఆమె స్త్రీ స్వరూపిణి. త్రిమూర్తులు సాధించలేని విజయాన్ని ఆమె సాధించింది. నీ వంతదానివి. నజరానాలు నా సంతోషం కొద్దీ తెచ్చాగాని, నీకేం తక్కువ. త్రిలోకసుందరి షహా బేగం ప్రధాన చెలికత్తెవి” అన్నాడు వీరేశలింగం.

“సాములూ! నన్ను ములగచెట్టెక్కిస్తున్నారు. ఈ ముద్రలు లేకపోతేనేం? నిండా పాతికేళ్ళు లేవు. హాయిగా బ్రతకరాదా? ఈ వ్యవహారంలో నా తల పోతుందని భయం లేదు. ఇంత చక్కగా చదువుకొన్నవారు, మీ ప్రాణం...”

“బాగా చెప్పావ్! ఆ శాస్త్రం కోసమే ఈ ప్రయత్నం. ఇది సమాజానికి పనికి వచ్చేది. ఇందులో నా ప్రాణం పోయినా ఫర్వాలేదు.”

“సరే! చేతిముద్ర లెట్లా తీయాలో చెప్పండి.”

వీరేశలింగం వివరించాడు. ఆయన ఫాతిమా చేతులికి ఓ జిడ్డు పదార్థం పులిమాడు. తెల్లటి కాగితాలమీద ఆమె చేతుల్ని ఒత్తాడు. ముద్రలు చక్కగా వచ్చాయి. “ఈ రకంగా తీయాలి. ఇదొక ఆటగా చేయాలి. ఆమె ఎదుట మళ్ళీ నీ చేతిముద్రలు వేయ్. ఆమె కూడా ఆ విధంగా వేస్తుంది. భద్రంగా నాలుగు ముద్రలు కలిపి పట్టుకొని రా.”

“కలిసిపోవూ? బేగం ముద్ర లెట్లా గుర్తిస్తారు?”

“అది నా పని.” వీరేశలింగం ఫాతిమా చేతిముద్రల్ని చూస్తున్నాడు. “ఇప్పుడు నీకు రాజయోగం ఉంది. మీ సర్దారు మనసులో నీవే ఉన్నావ్. ఇంతలో ఈ బేగం వచ్చింది. అయినా, ఈమె ఇక్కడ పక్షం రోజులుకూడా ఉండదు. నాకు తెలిసి ఈ మీ సర్దారు మూడోవాడు. ఆమె చేతిలోని ఆ రేఖ అట్లాంటిది. ఆమె మా పురాణాలలోని శ్యమంతకమణి లాంటిది. తన కనుసన్నలలో మెలిగే వారికి వరాలు కురిపించే దేవత లాంటిది. భోగదృష్టితో చూశారో... బూడిదవడం ఖాయం.”

ఫాతిమాకు కుతూహలం పెరిగింది. “మీ నజరానాలు నా కొద్దు. మాబేగం పూర్వగాథలు చెప్పండి. చెప్తేనే ఆమె చేతిముద్రలు...”

“ఆహాఁ. నా శాస్త్రంకోసం చెప్పక తప్పదు. అయితే, ఇది పరమ రహస్యం. పైకి పొక్కిందంటే ఆమెకోసం మహా సరదావడి దండయాత్ర చేస్తారు. ఆమె ఆయుస్సు చాలా గట్టిది. ఆమె ప్రాణానికి గాని, శీలానికి గాని కించిత్తుకూడా ఢోకా లేదు. ఈ రహస్యం బయటపడితే మీ సర్దారుకే ముప్పు. కాబట్టి నీవీ రహస్యం కాపాడు. అట్లా అని ఒట్టు వేయ్.” వీరేశలింగం తన చేయి చాచాడు.

ఫాతిమాఆశ్చర్యపోయింది. తాను సేవించే ముదునలి అమీరు మూడో కుమారుడు మున్వర్. చాలా మంచివాడు. తనవంక లాలసగా చూస్తాడు. కాని, ఆయన అమీరు, తాను గరీబు. ఆయన ఖామందు, తాను గులాము. పొసగదే! తాను గుక్కిళ్ళు మింగుతూ తొలగిపోయేది. ఇంతలో ఈ ఆపత్తు వచ్చింది. ఇదిన్నీ ఓ స్త్రీ రూపంలో వచ్చింది.

మున్వరొక రోజు సాయంకాలం నదిదాటి షికారెళ్ళాడు. లేడినో, పెద్దపులినో కొట్టి తెస్తాడనుకుంది. కాని, అర్థరాత్రి రహస్యంగా అంతకంటే ప్రమాదకరమైన షా బేగాన్ని పట్టుకు వచ్చాడు. ఆయన మనసులో ఏముందో తెలియదు. తాను మళ్ళీ వచ్చి అడిగేవరకు ఆమెను భద్రంగా సేవిస్తూ ఉండమని ఆజ్ఞాపించాడు. రహస్యం బయటపడితే తల


పోతుందని సెగ చేశాడు. ఆ కొత్త అవ్వరన వళ్ళూ, పాలూగానీ ముట్టదట! తండ్రి ఆజ్ఞ మీద మున్వ రేదో దూర ప్రాంతం వెళ్ళాడు. పక్షం వరకు రా నన్నాడు.

ఈ రహస్యం మూడో కంటివాడికి తెలియదనుకొంది. ఈ శాస్త్రం నిజమే అయి ఉండాలి. ఈ సామి ఎంత చదువుకొన్నాడో! అనుకుంటూ వీరేశలింగం చేతిలో చేయి వేసింది ఫాతిమా. ఎంతో ఆలోచించి ఆమె ఒట్టు వేసిందనుకొన్నాడు వీరేశలింగం. అతని ప్రతి మాటా దోరచెవులతో వింటోంది ఫాతిమా.

“నే నొక సన్యాసి లాంటి వాణ్ణి. నా చిన్నప్పుడు మా తాతగారి దగ్గరి కో సన్యాసి వచ్చాడు. ఆయన హస్తసాముద్రికం చక్కగా చెప్పగలడు. నా చేయి చూసి ‘ఆహా!’ అన్నాడు. తాతగారు విశేషా లడిగారు. ‘మీ పేరే అన్నారు గదా! మిమ్మల్ని మించిపోతాడు’ అన్నాడు స్వామి. ఆ తరువాత వాళ్ళు శాస్త్ర విషయాలు మాట్లాడుకొన్నారు. నాటినుంచి నేను సాముద్రిక శాస్త్రం నేర్చుకోవాలని కుతూహల పడ్డాను.

నా పద్దెనిమిదో ఏట ఇల్లు వదిలిపెట్టా. తిరిగిన ఊరు తిరగకుండా ఎన్నో గ్రామాలు చుట్టాను. ఎన్నో చేతులు చూశాను. కొత్త గీత కనిపిస్తే చాలు... చేతిముద్రలు సేకరించేవాణ్ణి. ఈ లాగున తిరగ్గా, తిరగ్గా... పక్షం రోజుల కిందట ఓ గ్రామం పొలిమేరలోని శివాలయంలో మకాం వేశాను. ఆ సమీపంలో రోజూ గొర్రెలు కాస్తున్న మణిలాంటి అమ్మాయిని చూస్తూండేవాణ్ణి. ఒక సాయంకాలం ఆమె గొర్రెల్ని గుంపుగా మలేసింది. స్వామికి నమస్కరించింది. నాకు సలాం చేసింది. చేతిరేఖలు చూపించి శకునం చెప్పమంది. తనకు మూడు రోజులుగా భయంకరమైనో కలలు వస్తున్నాయంది.

నే నామె చేతిని చూశాను. ఒక విలక్షణమైన రేఖ కనిపించింది. అదే శ్యమంతక రేఖ. ఆ రేఖను గురించి ఎప్పుడో ఒకసారి చదివా. శ్యమంతకమణి ఫలితాల నిస్తుందని పెద్దలు చెప్పగా విన్నాను. ఆ రేఖకోసం ఇంతవరకు ఎదురుచూస్తూ ఉన్నా. ఇప్పుడు దొరికింది. ఇక చేతిముద్రలు తీసుకొందా మనుకొన్నాను. ఒక ముదుసలి గొర్రెల్ని తోలుకుంటూ వచ్చాడు. ‘షా బేగం’ అని ఆ పిల్లను పిలిచాడు. పొలోమంటూ గొర్రెలన్నీ లేచాయి. ఆ ముదుసలి మొత్తం గొర్రెల్ని మలేస్తున్నాడు. చీకట్లు ముంచుకొస్తున్నాయి. ఆ పిల్ల - ‘సాములూ! శకునం’ అంది. ‘నీకు భయం లేదు’ అన్నాను అప్రయత్నంగా. ‘అయ్య దీవించాడు లే. కలలు రాకుండా నిదురోదువుగాని, అడుగెయ్!’ తరిమాడు ముదుసలి. ‘రేవు ప్రొద్దున్న వస్తావు గదా! చేతిముద్రలు తీసుకోవాలి.’ అడిగాను షా బేగాన్ని. ముదుసలి నవ్వుతూ - ‘ఈ రేత్రి దొంగ లెత్తికెడతారా ఏం?’ అంటూ వెళ్ళాడు. అప్పటికె ఆ పిల్ల ముదుసలి దింపిన గొర్రె




పిల్లని బుజాల కెత్తుకొని వెళ్ళిపోయింది. షా బేగ మేమిటి, శివుడికి నమస్కరించట మేమిటి అనుకొన్నాను. ఇది ఈ గ్రామ ఆచరం కాబోలు అని సరిపెట్టుకొన్నాను.

మరునా డింకా తెల్లవారలేదు. తెల్లవారాలి, గొర్రెలతో షా బేగం రావాలి, చేతిముద్రలు తీసుకోవాలి అనుకొంటూ ఉండగా.. ఆమెకు బదులు ఆ ముదుసలి వచ్చాడు. వస్తూనే తన కూతు ర్నొక గూండా ఎత్తుకొని పోతున్నాడని ఓ దిక్కుచూపి ఏడవసాగాడు. పరుగున పోయి తన బిడ్డను కాపాడమన్నాడు. ఆమెను తాను కాపాడగలడా? ఆమె శీలాన్ని కాపాడగలడా? తన కామె చేతిముద్రలు కావాలి...ఇట్లా అనుకుంటూ ఆ ముదుసలితో ఏం చెప్పానో ఏమో, ఆ దిక్కుగా పరుగెత్తా. తూరుపురేకలు విరిసినయ్. దూరాన ఆ పిల్ల - నిన్న కట్టిన ఎర్రపావడాతో - ఆ సాహసి బుజాన వేలాడుతోంది. ఆ దుష్టుడు ఇంతదూరం ఎందుకు పరుగెత్తుకొచ్చినట్టు అని అనుకొంటూ ఉండగా వాని వెనుక కోతులు కనిపించాయి. ఆహా ఇందుకా - అనుకొన్నాను. ఆలాగున రెండుజాములు గడిచాయి.

అంతవరకు పరుగుతీసి అలిసిన ఆ మొరటువాడు ఆమెను కిందికి దింపాడు. కోతులు కిచకిచలాడుతూ చెట్లెక్కాయి. ఆమె పెనుగులాడుతోంది. తనకు చాలా దూరంలో ఉంది. ఈలోపున ఏం జరుగుతుందో?

ఇంతలో వెనుకనుండి మరాటీదండు వచ్చింది. వాళ్ళు తాను వదలి వచ్చిన గ్రామాన్ని దోచిన ట్లున్నారు. గుర్రాలమీద క్షణాలలో వచ్చేశారు. వస్తూనే ఆ గూండాను చంపేశారు. ఆ కోతులు సంతోషంతో కాబోలు కిచకిచలాడుతూ కొమ్మ లూపుతూ ఆడాయి.

ఇంతకూ ఆ పిల్లకు చిన్న ప్రమాదం తప్పిపోయింది. అంతకంటె బలమైన ప్రమాదం ఎదురైంది. వాళ్ళంతా మరికొంత దూరం పోయి విశ్రమించారు. వాళ్ళంతా ఏదో తిన్నారు, తాగారు. కాని, ఆమె మాత్రం ఏమీ తినలేదు, తాగలేదు. వాళ్ళల్లోని ఓ ముదుసలి ఆమెకు కావలాగా ఉన్నాడు. దగ్గరకు కుర్రకారు చేరితే తరిమికొడుతున్నాడు. ఆ ముదుసలి కామె ఒక చెట్టు చూపింది. ఆత డా చెట్టెక్కి పళ్ళుకోసి ఆమె కిచ్చాడు. ఆమె ఆ పళ్ళు తిన్నదేకాని, వాళ్ళ నీళ్ళు తాగలేదు.

వింటూన్న ఫాతిమా “భేష్” అంది. “సాములూ! మీలో సాము లున్నట్లే మాలోనూ ఉన్నారు. వాళ్ళు మా చేతినీళ్ళు తాగరు” అంటూ మెచ్చుకొంది ఫాతిమా

వీరేశలింగం మళ్ళీ మొదలుపెట్టాడు - “నా గోల నాది. వీ ళ్ళామెను వదిలి వెళ్తారా? ఆమె చేతి ముద్రలు తీసుకోవాలి. ఎట్లా? కా సేపటిలో సూర్యు డస్తమిస్తా డనగా మీ యజమాని గుర్రంమీద వచ్చాడు. షా బేగం బిగ్గరగా - ‘బచావో, బచావో’ అని అరిచింది. మీ యజమాని చాలా చురుకైనవాడు, వీరుడు. ఒంటరిగా ఉన్న పిల్లను రక్షించటానికి శాయశక్తులా పోరాడాడు. వాళ్ళు వట్టి దొంగలేకాని, వీరులు కారు. మీ యజమాని కత్తి నలుగురైదుగురి నెత్తురు చవిచూసింది, లేదో వాళ్ళు మూ టా ముల్లే సర్దుకున్నారు.

నేను కొంత సమీపానికి వచ్చాను. న న్నామె చూసింది. మొగం కలకల్లాడింది. ఆమె అతనితో ఏదో మొరపెట్టుకొంది. అత డామెను తీసుకెళ్ళి ఆ గొర్రెల కాపరి కప్పగిస్తాడా? అనుకుంటున్నా. ఇంతలో మీ యజమాని షా బేగాన్ని గుర్రం ఎక్కించుకొన్నాడు. దారి అంత బాగాలేదు. ఆమెకు కుదుపు లేకుండా ఉండాలని కాబోలు నెమ్మదిగా గుర్రాన్ని నడుపుతున్నాడు. ఇంతలో చీకటి పడింది.

ముందు గుర్రం, వెనుక నేను. ఇట్లా ఒక జాము నడిచాము. ఇంతలో నది అడ్డం వచ్చింది. నది దాటి షా బేగంతో నీ యజమాని తన కోట జేరాడు. ఆ తర్వాతి కథ నీకు తెలును” అని వీరేశలింగం తన కథ ముగించాడు. మళ్ళీ ఫాతిమాహస్తముద్రల్ని పరిశీలిస్తూ - “ఇక నీ యజమానికి నీవు బేగం కావాలి!” అన్నాడు.

ఫాతిమా తాను మున్వరుకు బేగం అయినంత సంతోషించింది. వెంటనే షా బేగం గుర్తు వచ్చింది. ఆమె మొగం చూచిన తన యజమాని ఇంకా తన్ను ప్రేమిస్తూ ఉంటాడా? అనుకొన్నది. పక్షంరోజుల కంటె షా బేగం ఇక్కడ ఉండదని ఈ సామి జోస్యం చెప్పాడు. ఈలోగా ఏం జరుగుతుందో అనుకుంది.

“అయితే, సాములూ! ఈమె ఇక్కడే ఉంటే మా సర్దారు కేమైనా ముప్పా?”

“అమ్మా! అది నీ వడగాలా? దానిని నేను తప్పించగలనా? నేను వచ్చింది మణివంటి ఆ పిల్లను రక్షించగలనని కాదు. ఆరేఖ! ఆ రేఖ ఎంత చేస్తున్నది!”

“సరే పక్షం తరువాత ఇదేవేళకు ఇక్కడే కలుసుకుందాం. ఈలోగా చేతిముద్రలకోసం ప్రయత్నిస్తా.”

పక్షం గడిచిపోతుందనగా మున్వరు చాలా హడావిడిగా వచ్చాడు. తన తండ్రిని మించిన సర్దారులు పాతపగలు సాధించటంకోసం సైన్యంతో బయలుదేరిన వార్తలు తెచ్చాడు. మున్వరు కదలాడిపోయినాడు. రహస్యంగా

ఫాతిమాను కలిసికొన్నాడు. "షా బేగం అపురూప సౌందర్యవతి అనీ, ఆమెను దుండగుల బారి పడకుండా నది ఒడ్డునగల ఫకీరు ఆశ్రమం చేర్చ"మనీ అన్నాడు.

అర్ధరాత్రి ఫాతిమా షా బేగాన్ని ఫకీరు కప్పగించి భద్రం అని చెప్పింది. ఫకీరు విస్తుపోయి ఆమెను రక్షించటం కష్టమే అనుకున్నాడు. అల్లాను స్మరించాడు. తిరిగి వస్తున్న ఫాతిమాను వీరేశలింగం కలుసుకున్నాడు. ఆమె ఆశ్చర్యపోయి, "నా జాడ మీ కెట్లా తెలును?" అంది.

వీరేశలింగం - "మీ సర్దారు నివాసాన్ని అప్పటినుంచీ పరిశీలిస్తూనే ఉన్నాను" అన్నాడు.

"ఎంత ప్రమాదం, సాములూ! ఎవరైనా మిమ్మల్ని గూఢచారు లనుకొంటే...ఇంతకూ మీ రన్నంతా జరిగింది. ఘడియలో శత్రువులు చుట్టుముడుతున్నారు. వెంటనే ఈ పట్నం వదిలివెళ్ళండి" అన్నది ఫాతిమా.

"ఫర్వాలేదు. చేతిముద్రలు తెచ్చావా?" అడిగాడు వీరేశలింగం.

"ఎప్పుడో తీశాను. ఈ ముద్రల ఆట నేను మొదలుపెట్టే వేళకు బేగం మొహంలో ఎన్నో కొత్త కళలు నాట్యమాడాయి. బహుశః మీరే గుర్తొచ్చా రేమో! చాలా నిబ్బరంగా ఉంది. మీ దీవెన ఫలితమే కాబోలు. బ్రతికి బాగుంటే రేపు కలుసుకుందాం. అంతవరకు మీ రీ పట్నంలో ఉండొద్దు." తరిమింది ఫాతిమా.

వీరేశలింగం రాత్రికి రాత్రే నది దాటి అడివి గడిచి షా బేగం తండ్రి ఉన్న గ్రామం చేరాడు. జరిగినదంతా ఆ పిల్ల తండ్రికి వివరించాడు. ఆ ముదుసలి తన కూతురింకా బతికి ఉన్నందుకు ఆశ్చర్యపోయాడు. "సాములూ! నా బిడ్డను మీరే రక్షించాలి. నన్నా ఫకీరు దగ్గరకు తీసుకొనిపొండి" అని అర్థించాడు.

ఫాతిమాతరిమితే ఆ పట్నం వదిలి వచ్చాడు తాను. ఆ పిల్ల హస్తముద్ర లింతవరకు చేతికందలేదు. పాపం, ఫాతిమాకేమైందో అని అనుకొంటూ ముదుసలితో బయలుదేరాడు. ఎట్లాగో అడివి దాటారుగాని, నది పొంగుమీద ఉంది. యువకుడైన తానే దాటలేడు. ఈ ముదుసలి ఈదగలడా అనుకొంటూ పక్కకు తిరిగాడు. ముదుసలి కనిపించలేదు. ఏమైనట్టు? నదిలోకి చూశాడు. ఒక మహాసర్పం తలపైకి పెట్టి ఈదుతున్నట్టున్నాడు ముదుసలి.

మొత్తానికి ఇద్దరూ ఆవలిగట్టు మీది ఫకీరు ఆశ్రమం చేరారు. ఫకీరు వీళ్ళనుచూసి, వీళ్ళ కథ విని ఆశ్చర్యపోయాడు. ఆ పిల్ల వచ్చిన దగ్గరనుంచే నది పొంగు చూపిందట! తానే ఆశ్రమం వదలా లనుకొంటున్నాడు. పిల్ల నెట్లా రక్షించటం? అయినా, ఫకీరు ముదుసలిని నిలదీశాడు - "నీవేమో ఈలాగున్నావ్. ఇంత అందగత్తె నీ కూతురా?' అని.

అప్పుడు ముదుసలి కళ్ళు మూసుకొని జ్ఞాపకాల పాతరలు తవ్వుకొన్నాడు. "పదిపన్నెండేళ్ళ క్రితం మాట! మాగ్రామానికి పదికోసుల దూరంలో శివరాత్రి ఉత్సవం జరిగింది. వేల జనం వచ్చారు. నేను ఆటవస్తువు లమ్ముకొంటున్నాను. చీకటి పడేవేళకు ఈ పిల్ల నా వెంట ఉంది. తల్లీ, తండ్రీ ప్రయత్నించే ఉంటారు. నేనూ ప్రయత్నించాను. కాని, ఇట్లా రాసిపెట్టి ఉంది కాబోలు. ఎవరూ గుర్తుపట్టలేదు. మొహాన బొట్టున్నది. తండ్రి పేరేదో శాస్త్రి అని చెప్పింది. మాగ్రామం మీదుగా పోయే ప్రతి అయ్యవార్నీ అడిగేవాణ్ణి - ఫలానా శాస్త్రిగారు తెలుసా!' అని. తెలునన్నవాడే కనిపించలేదు.

అప్పటినుంచీ ఈ పిల్ల నా దగ్గరే పెరిగింది. పెరిగిందన్న మాటేగాని, నా చేతికూడు తిన్నదా? పాలు, పళ్ళతో పెరిగింది. ఆ తల్లి వచ్చిన దగ్గర నుంచి నేను తిండికి బాధపడలేదు. గొర్రెలు మందలు మందలుగా పెరిగాయి."

ఫకీరు తృప్తిపడ్డాడు. 'ముందు నా బాధ్యత వదిలించుకోవాలి. గెల్చి ఉంటే మున్వరు ఈ పిల్లను ఈపాటికి తీసుకొనిపోడా? ఈ నది ఇంకా పొంగకముందు నా కర్తవ్యం నేను నెరవేర్చాలి' అనుకొన్నాడు ఫకీరు. షా బేగాన్ని ఆ గొర్రెల కాపరి కప్పగించాడు.

వీరేశలింగం ఆమె చేతులవంక చూస్తున్నాడు. 'ఇప్పుడైనా హస్తముద్రలు తీసుకొంటే బాగుండును' అనుకుంటున్నాడు. ఆమె అతని వంక చూసి ఆశ్చర్యమో, సంతోషమో అనుభవిస్తూ తన చేతిని చూచుకొంటూ ఉన్నది.

"ఇప్పుడైనా నీ చేతి ముద్ర లిస్తావా?" అడిగాడు వీరేశలింగం. ముదుసలి నవ్వుతూ, ఇంకా చేతిముద్ర లెందుకయ్యా, సాములూ! చేతులే తీసుకోండి" అన్నాడు.

"నీవు షా బేగానివి కావు. సర్వవరాలు ఇచ్చే దేవతవు. శ్యమంతక మణివి." గొణుక్కున్నాడు వీరేశలింగం ఆమె చేతుల నందుకొంటూ. ■

Printed and Published on behalf of
Andhra Prabha Pvt. Ltd. by MANOJ KUMAR SONTHALIA
at the Dinamani Press, Ex press Estate, Madras-600 002.
Editor: POT-TURI VENKATESWARA RAO

## కొత్త పుస్తకాలు

### మూడు నాటికలు

(రచన: శ్రీ సముద్రాల జూనియర్. ప్రతులకు: అరుణా పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్, విజయవాడ-2. పేజీలు 92. వెల: రు. 10-00.)

సినిమారచయితగా సుప్రసిద్ధులైన శ్రీ సముద్రాల జూనియర్ (వేంకట రామానుజాచార్యులు) సినిమానటులు నిధి సేకరణకోసం ప్రదర్శన లివ్వడానికి రాసిన నాటికలివి. ఈ మూడు నాటికలలోనూ నేటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు ముఖ్య పాత్రధారణ చేశారు.

'శ్రీకృష్ణ తులాభారం' ప్రసిద్ధ పౌరాణిక గాథ. ఈ నాటిక 1969 లో గోదావరికి వరదలు వచ్చినప్పుడు నిధి సేకరణకు ప్రదర్శించారు. రెండో నాటిక 'పోలీసు రామన్న' 1965 లో పోలీసు సంక్షేమ నిధికోసం రాసింది. కర్తవ్య నిర్వహణలో ప్రాణాలర్పించిన సాహసమూర్తి చిత్రణ ఇది. మూడో నాటిక 'జయం మనదే' 1965 లో పాకిస్తాన్ భారత దేశంపై దండెత్తినప్పుడు జవానుల సహాయనిధి సేకరణకోసం ప్రదర్శించారు. దేశ భక్తి ప్రబోధకమైన నాటిక ఇది.

ప్రదర్శనకు అన్ని విధాలా యోగ్యమైన నాటిక లివి. ముఖచిత్రం ఆకర్షణీయంగా ఉంది.

-జి. రా.

### మయవాస్తు

(రచన : శ్రీ గోరస వీరభద్రాచార్యులు. ప్రాప్తిస్థానం : గోరస దుర్గాప్రసాద్, శ్రీగాయత్రీ జ్యోతిషాలయం, వీరవరం, వయా మల్లాం, తూ. గో. జిల్లా. క్రౌన్ పుటలు. 252. వెల: రు. 25—00.)

**గృహ నిర్మాతలకు.** గృహస్థులకూ ప్రయోజనదాయకమైన గ్రంథమిది.

గృహవాస్తువునకు సంబంధించిన 32 అంశాలు ఈ గ్రంథంలో సాకల్యంగా చర్చించ బడ్డాయి. గ్రంథకర్త సందర్భానుసారంగా వాస్తు విద్య, వాస్తు రత్నాకరం, పరాశర సంహిత సకలాధికారం మొదలైన వాస్తు శాస్త్ర గ్రంథాలను సంప్రతించి సమన్వయ పూర్వకంగా ఈ గ్రంథం రచించారు. మహాశిల్పి అయిన మయుని అభిప్రాయాలను అచ్చటచ్చట పొందుపరిచారు.

గృహ నిర్మాణాభిలాషులకు ఉపయుక్తమైన ఈ గ్రంథం వెల ఇంతకంటె కొంత తక్కువగా ఉంటే బాగుండేది.

-ఉత్పల